# పాము మొక్క

-ఎస్.ఎస్.వి.ఎ.కె.కుమార్

"నీ మొహం మండ గట్టిగా ఆఘోరించవే. నీలో నువ్వు గొణుక్కు ఛస్తావే?" తనకున్న భాషా పరిజ్ఞానం అంతా ఉపయోగిస్తూ ఫోనులో అమాంతం గట్టిగా అరిచాడు అరవిందం.

సన్నగా అక్షరం అక్షరం ఒత్తి నత్తిగా మాట్లాడుతోంది ఓ స్త్రీ అవతలవైపునుంచి.

"ఏ...వండి...పా...పా...పామండి" భయం భయంగా ఖంగారుగా ఒణుకుతోంది ఆ స్త్రీ స్వరం.

"ఏమిటే అర్థం అవట్లేదు. కొత్తగా నత్తిగానీ సంప్రాప్తించిందా? సరిగ్గా ఏడు ఏమిటి?" అదుర్దాగా అడిగాడు అరవిందం.

మళ్లీ అదే గొణుగుడు. దానికి సమాధానంగా అరవిందం అదే చిరాకు. ఇలా కొన్ని క్షణాలు గడిచాకా కొంచెం స్థిరమైన గొంతుతో పలికింది అరవిందం భార్య అలివేలు.

"నేను బట్టలు ఉతికి ఆరేద్దామని పెరట్లోకి వచ్చాను. అక్కడ దణ్ణెం తెగిపోయిందని కడదామని ఒంగాను..."

"నడుంగానీ పట్టేసిందా? దరిద్రం వదిలిపోయింది..." మధ్యలో అడ్డుపడ్డాడు అరవిందం.

"అబ్బా చెప్పేది వినరేం? క్రిందకి ఒంగానా బట్టలన్నీ క్రింద మట్టిలో పడిపోయాయి"

"మళ్లీ తడిపి ఆరేయ్. దీనికి ఇంత నత్తి ఎందుకో తింగరి పీనుగా"

"అదికాదండీ..."

"మరి త్వరగా చెప్పు. నాకు బిపి పెరిగిపోతోంది. అయినా టీవీ సీరియల్‌లో చెప్పినట్లు అంత ఉపోద్ఘాతమా" ఆఫీసు పనిలో బిజీగా ఉండడం వలన విసుక్కున్నాడు.

"సరిగ్గా అప్పుడే గమనించానండి. మొక్కల్లో కదలికలు. పరికించి తీక్షణంగా చూద్దును కదా పామండి. ఇంత పొడుగు పాము"

"ఏమిటి? పామా?" అమాంతం టేబుల్ మీదకి ఒక్క గెంతు గెంతి కూర్చుని అటూ ఇటూ చూస్తూ ఖంగారుగా ప్రశ్నించాడు అరవిందం.

అసలే కొంతసేపటినుంచి గట్టిగా అరుస్తూ మాట్లాడుతున్నాడేమో కొంత వింతగా చూస్తున్న మిగతావాళ్లంతా ఈసారి ఈ కొత్త చేష్టకి ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. టేబుల్ మీదకెక్కి ఒగురుస్తున్న అతన్ని చూసి ఖంగారుపడ్డారు.

"నువ్విప్పుడు ఎక్కడున్నావ్?" ప్రశ్నించాడు అరవిందం అలివేలును.

"తలుపులన్నీ వేసేసుకుని కిటికీలోంచి దాన్ని చూస్తూ మీతో మాట్లాడుతున్నాను"

"ఇప్పుడెక్కడుంది పాము?"

"సన్నజాజి పందిరి మీదనుండి క్రిందికి దిగుతోంది. ఆ దిగేసింది.. కాదండోయ్ మళ్ళీ వెనక్కి తిరిగింది"

"నువ్వు జాగ్రత్త బయటకు రాకు" జాగ్రత్త చెప్పాడు.

"నా మొహం దాన్ని చూస్తేనే నాకు కాలు చెయ్యి ఆడట్లేదు. ఇంక బయటకేం వస్తాను?"

"సర్లే నేను ఇంకో అరగంటలో వచ్చేస్తాను. ఇప్పుడెక్కడుంది?"

"సావిట్లోకి వచ్చింది. మెట్లమీద ఆగింది" పాము గోలంతా లైవ్ చెప్తోంది అలివేలు.

"మెట్లమీదంటే ఎటువైపే మట్టిమొహమా" ప్రాసలో తిట్టాడు అరవిందం.

"నాకు సరిగ్గా కనిపించట్లేదు. ఆ...వెళ్లిపోతోంది...వెళ్లిపోయింది" లైవ్ కార్యక్రమం పూర్తయింది.

"నువ్వు బయటకు వెళ్లి చూడు. అది ఎడం ప్రక్కకు వెళ్లిందో కుడిపక్కకు వెళ్లిందో నేను లైన్‌లో ఉంటాను"

"నేను మీరు వచ్చేదాకా అసలు బయటికే రాను. మీరు త్వరగా రండి" ఫోన్ పెట్టేసింది అలివేలు.

తనూ ఫోన్ పెట్టేసి ఈసారి టేబుల్ మీద నుండి కిందికి దిగి కుర్చీలో కూలబడి రుమాలుతో నుదుటికి పట్టిన చెమట తుడుచుకుంటున్నాడు అరవిందం.

"ఏమయిందండీ?" స్టాఫ్ అంతా అడిగారు అరవిందాన్ని. అలివేలు లైవ్ అంతా మళ్ళీ రీ ప్లే చూపించాడు అరవిందం.

"ఆహా పామా, ఏ రంగులో ఉందిట. లావు ఎంతో?" ప్రశ్నించాడు గుర్నాథం.

"ఏమోనండి అది అడగలేదు సుమా. అసలు ఏమి మాట్లాడుతున్నానో స్పృహ ఉంటే కదా. మీరు ఏమైనా అనండి పామంటే నాకు మాత్రం చచ్చేంత భయం" తన అభిప్రాయం వెలిబుచ్చాడు అరవిందం.

"ఎంత భయమో తెలుస్తూనే ఉందికానీ. జాగ్రత్తండోయ్. ఇంటికి వెళ్లగానే అడగండి. లావుగా ఉందనుకోండి అది జెర్రిగొడ్డే. జెర్రిగొడ్డయితే మాత్రం ప్రక్కన త్రాచుపాము కంపల్సరీ. తన సర్పజ్ఞానం అంతా ప్రదర్శించాడు గుర్నాథం.

"త్రాచుపామా?" కాళ్ళు పైకి పెట్టేశాడు అరవిందం.

"మీరు ఊరుకుందురు. అసలే ఆయన పావుగంట నుంచి వణికిపోతున్నాడు. మీరు పాములు వాటి రకాలు, జీవన విధానాలు గురించి ఇప్పుడే వివరించాలా?" వారించాడు విశ్వనాథం.

ఒక పదినిముషాలు చాలా భారంగా గడిపి ఇక కూర్చోలేక బాసుని పర్మిషన్ అడిగి ఇంటికి వెళ్లిపోదామని అనుకుని టైం చూశాడు. లంచ్ అవర్‌కి ఇంకా పావుగంటే ఉండడంతో ఆ ప్రయత్నం విరమించుకుని సమయం ఎప్పుడు గడుస్తుందా, ఇంటికి వెళ్లే సరికి గుమ్మంలో పాము పడగ విప్పి ఉంటుందా లేక తన కాళ్లకు అడ్డంపడుతుందా అని ఆలోచిస్తూ ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చున్నాడు.

ఇంతలో ఆఫీసు పనిమీద బయటకు వెళ్లి వచ్చిన లింగాచారి కుర్చీలో ఓ మూలకు కూర్చున్న అరవిందాన్ని చూసి "ఏమిటి సంగతి?" అడిగాడు అడ్వర్‌టైజ్‌మెంట్‌లో బామ్మగారిలా.

అంతే మళ్ళీ సీను మొత్తం కళ్ల ముందు తిరిగిన అరవిందం కాళ్లు టేబుల్‌పై పెట్టేలోపే విశ్వనాథం కల్పించుకుని "ఆ పాప ఏడ్చింది" అంటూ విషయాన్ని సగంలోనే తెగేశాడు.

అయినా వదలని లింగాచారి మళ్లీ రెట్టించడంతో జరిగినదంతా రింగులు తిప్పాడు అరవిందం ఒకింత ఒణుకుతూనే.

"జాగ్రత్త గురూ! అది కట్లపామైతే దానికి ఒంటి నిండా కట్లుంటాయి. అది కనక కాటేసిందో దానికి ఎన్ని కట్లుంటాయో అన్ని ఎక్కిళ్ళు వచ్చి పోవడం ఖాయం'' అంటూ ఇతను మరొక పాము జాతి గురించి చెప్తుండగానే ఎక్కిళ్ళు ప్రారంభమయ్యాయి అరవిందానికి.

మళ్లీ అందరి ఆశ్వాసన తీసుకుని నెమ్మదిగా ఇంటికి బయలుదేరాడు. ఇంటి సందు మొదట్లోనే సైకిల్ దిగిపోయి అటూ ఇటూ చూస్తూ పిల్లిలా అడుగులేస్తూ గేటు దగ్గరకి చేరాడు. గేటులోపల నుంచి ఇంట్లోకి దొంగలా చూస్తూ పాము లేదని నిశ్చయించుకున్నాక నెమ్మదిగా అడుగులోపల



పెట్టాడు కొత్త పెళ్లికూతురిలా. కొట్టీ కొట్టనట్లు తలుపుతట్టాడు.

అలివేలు తలుపు తీసి "రండి త్వరగా" అంటూ జబ్బ పుచ్చుకుని లోపలికి ఈడ్చి తలుపు మూసేసింది.

లోపలకు వెళ్లిన తర్వాత పాము గురించి మరిన్ని వివరాలు అడిగాడు అరవిందం.

"కట్లున్నాయా? ఏ లావుంది? ఏం రంగుంది?" అంటూ ఆఫీసులో వాళ్ళు చెప్పినవన్నీ స్మృతిపథంలోకి తెచ్చుకుంటూ ప్రశ్నించాడు.


"చాల్లెండి బడాయి. అసలు దాన్ని చూడగానే అవయవాలన్నీ అదుపుతప్పాయి. ఇంక రంగు, లావు గమనించే స్పృహ ఉందా?" అంటూ కంగారుగా చెప్పింది అలివేలు.

"సర్లే ఈసారి వస్తే అన్నీ గమనించు. కట్ల పామయితే డేంజరుట. అదే మరి జెర్రిగొడ్డయితే త్రాచుపాము కూడా ఇక్కడే ఉంటుందిట" అంటూ తనకి వాళ్ళు చెప్పినవన్నీ వల్లెవేస్తూ సర్పపాఠం చెప్తున్నాడు అరవిందం.



## తీపి గురుతులు

సినిమా షూటింగ్స్‌తో పాటూ కమర్షియల్ యాడ్స్‌లో కన్పిస్తూ అందర్నీ అలరిస్తున్న తార కరీనాకపూర్. ఇప్పుడీ భామ మైక్రోసాఫ్ట్ కొత్త ప్రొడక్ట్స్ ఆవిష్కరణలో తన నెచ్చెలికాడు షాహిద్‌తో కలిసి కన్పించింది. వీరిద్దరూ ఇలా కన్పించడం మామూలే. సినిమా షూటింగ్స్‌లో బిజీగా ఉన్నా ఆటవిడుపు కోసం వీరిద్దరూ ఇలా కన్పించడం బాగానే ఉందంటున్నారంతా. కనువిందు చేసే ఆ సీన్స్ అభిమానులకి ఎప్పటికీ గురుతుండిపోతాయి.




"ఊరుకుంటారా? అసలు పాము మళ్లీ రాకూడదని కోరుకోవాలి గానీ వస్తే రంగు, లావు, వగైరా చూసి జాతి నిర్ధారణ చెయ్యమంటారేమిటి? మతిపోయిందా?" గద్దించింది అలివేలు.

"అదికాదే. అసలు రాకపోతే మంచిదే. అయినా..." అంటూ ఏదో చెప్పేలోగానే "చాల్లెండి. అసలు లేదు, వడ్డీలేదు. లేవండి భోజనం పెడతాను" అంటూ కొంగు జాడించి విసవిసా వెళ్లిపోయింది అలివేలు.

★ ★ ★

ఆవేళ నుండి కిందపడిపోయిన పావలా బిళ్ళ వెతుక్కునే వాడిలాగా అటూ ఇటూ చూసుకుంటూ నడవడం మొదలుపెట్టాడు అరవిందం. నాల్రైదు రోజులు గడిచాయి.

ఈలోగా వాళ్ల అమ్మమ్మ ఇంటికి వెళ్లిన తన నాలుగు సంవత్సరాల పుత్రరత్నం ఇంటికి తిరిగవచ్చాడు. నాటి నుండి అరవిందం భయం రెట్టింపయింది. పిల్ల వెధవ తెలీక దాని దగ్గరకు వెళ్ళి తోక పుచ్చుకు తిప్పుతాడేమోనని "ఇంక నేను ఆఫీసుకు వెళ్లాక వాణ్ణి ఒంటరిగా వదలకు. తలుపులన్నీ వేసుకు కూర్చోండి. అన్నట్టు అన్ని కంతల్లోనూ గుడ్డముక్కలు పెట్టావా?" అంటూ పదే పదే చెప్పిందే చెప్పడం మొదలుపెట్టాడు.

"ఆ...ఆ..." అంటూ తలాడించేది అలివేలు. రోజులు గడుస్తున్నాయి.

"ఏమైందీ మీ పెంపుడు పాము?" ప్రశ్నించాడు లింగాచారి.

"వెధవది పూర్తిగా పోలేదు. అప్పుడప్పుడు దర్శనమిస్తూనే ఉంది. ఏ టైంలో వస్తుందో దానికే తెలీదు" సమాధానమిచ్చాడు అరవిందం.

"రాత్రిపూట బయటకు వచ్చేముందు చప్పుడు చేసి వస్తూ ఉండండి. ఆ చప్పుడికి మీరు బయటకు రాకుండానే అది నెమ్మదిగా సర్దుకుంటుంది" స్వానుభవం వివరించాడు లింగాచారి.

ఆనాటి నుంచి తలుపు ప్రక్కనే పెద్ద స్టీల్ పళ్లెం, గరిట పెట్టాడు అరవిందం. బయటకు వెళ్ళే ప్రతిసారి ఆ పళ్ళెం మీద ఢాం ఢాం అంటూ నాలుగు బాదులు బాదడం అలవాటుచేసుకున్నాడు.

పాము మాటేమో గానీ ఆ చప్పుడికి చుట్టుప్రక్కల వాళ్ళు వాళ్ళ నిద్రలు పాడై తిట్టుకునేవారు.

అలాగే అతని కొడుకు కూడా నిద్రలో నుంచి ఉలిక్కిపడి లేచి ఏడుపు మొదలుపెట్టేవాడు. వాడిని సముదాయించి నిద్రపుచ్చేసరికి తాతలు దిగేవారు అలివేలుకి.

ఆఫీసుకు కొత్తగా బదిలీపై వచ్చిన భుజంగం ఆ నోట ఈనోటా ఈ విషయాలన్నీ తెలుసుకుని-

"అరవిందంగారూ మంత్రించిన బూడిద ఇంటి చుట్టూ చల్లితే పాములు రావండి. ప్రయత్నించరాదూ" అంటూ ఓ సలహా పారేశాడు.

"ఎక్కడ దొరుకుతుంది?" ఆసక్తిగా అడిగాడు అరవిందం.

"అలా అడిగారు బావుంది. ఓ రోజు సెలవు పెట్టి నాతో రండి మనిద్దరం తెద్దాం" అంటూ తొందరపెట్టాడు భుజంగం.

"అలాగే" అంటూ భుజంగం లేని సమయం చూసి "బూడిదకి పాము కట్టుబడుతుందా?" ప్రక్కనే ఉన్న గుర్నాధం పై అనుమానం సంధించాడు అరవిందం.

"భలేవారే. భుజంగం పాము విషయాలలో దిట్ట. వాడికి పాము సంగతులలో కొబ్బరికాయ కొట్టడం దగ్గర్నుంచి గుమ్మడికాయ కట్టేవరకూ అన్నీ తెలుసు. అనుమానం లేకుండా సింపుల్‌గా అతనిని ఫాలో అయిపోండి" భుజంగాన్ని సమర్థించాడు గుర్నాధం.

★ ★ ★

అలాగే ఓరోజు సెలవు పెట్టి ఇద్దరూ వెళ్లి మంత్రించిన బూడిద తెచ్చారు. దారిఖర్చులు, బూడిద ఖర్చు కలిపి ఐదువందల పచ్చకాగితాన్ని

కర్పూరం చేసేశాడు భుజంగం. డబ్బులుపోతే పోయాయి కానీ పాముపోతే చాలనుకుని బూడిదని చాలా శ్రద్ధగా ఇల్లంతా చల్లి కొంత దాచుకున్నాడు కూడా.

అదేమి చిత్రమో కానీ కొన్నిరోజులుగా కనబడని పాము ఆరోజు సాయంత్రమే బూడిద మీదనుండి పాక్కుంటూ ఒక అరగంటసేపు దాని విన్యాసాలు చూపింది.

దానికి ఒళ్లంతా బూడిద అంటుకుని మేకప్ వేసుకున్న షూటింగ్ పాములా వింత సోయగంతో కనిపించి మరీ అరవిందానికి కనువిందుచేసింది. ఆ అరగంట అతనికి పాము కాదు కానీ ఐదువందల కాగితం బూడిదలో తిరుగుతున్నట్లు అనిపించింది అరవిందానికి. డబ్బూ పోయిందీ, బూడిదా పోయిందీ అనుకుంటూ అదే విషయం భుజంగానికి చెప్పాడు అరవిందం.

"అలా జరిగిందా? అరెరె, అలా జరగకూడదే" అంటూ బుగ్గమీద వేలేసుకుని ఐన్‌స్టీన్‌లాగా ఆలోచనలలోకి వెళ్లిపోయాడు భుజంగం.

"అలాగే జరిగింది. డబ్బు పోయింది, పనీ జరగలేదు. ఐదొందలు పెట్టి పాము మేకప్ పౌడర్ కొన్నాం. ఇదేదో ఉత్తరాన మబ్బులా ఉంది. మాలో ఒకరిని రుచి చూస్తేనే గానీ ఊరికే వదిలేలా లేదు" చాలా బాధగా నిట్టూర్చాడు అరవిందం. నాటి నుండి ఎవరేం చెప్పినా వెంటనే అది ఎంత కష్టమైన పని అయినా ప్రయాసపడి చెయ్యడం పనైపోయింది తనకి.

"పోనీ ఎవరినైనా పిలిచి పట్టిస్తే?" అనుమానం వ్యక్తం చేశాడు లింగాచారి దగ్గర.

"సర్లెండి. అవతల దాన్ని పట్టుకునేవాడు మన వీక్‌నెస్ కనిపెట్టి ఎవరూ చూడకుండా మన దొడ్లోనే వదిలేస్తాడు. మళ్లీ మనం వాణ్ణి ఎలాగా పిలుస్తాం. ఇదే రకంగా దఫాకు రెండు మూడొందలు గుంజేస్తూనే ఉంటాడు" అని లాభం లేదంటూ అరవిందం ఆలోచనని కొట్టేశాడు లింగాచారి.

మరికొన్నిరోజులు గడిచాయి కానీ పాము బెడదమాత్రం పోలేదు.

"ఏమండోయ్ నేటితో మీ కష్టం గట్టెక్కినట్టే. ఇదిగో ఇదేమనుకున్నారు. పాము మొక్క. ప్రత్యేకంగా మీ కోసం చాలా కష్టపడి తెప్పించాను. ఈ మొక్క ఉన్న కొంత ప్రాంతం వరకూ పాము నీడైనా పడడానికి వీల్లేదు. అంత పవర్‌ఫుల్. దీనిని మీ ఇంట్లో నాటించండి. మళ్ళీ పాము కనబడదు" అంటూ ఓ రెండుమొక్కలు అరవిందం చేతికందించాడు భుజంగం.

వెంటనే భుజంగాన్ని ఎత్తుకున్నంత పనిచేసి గబగబ ఇంటికెళ్లి ఒకటి దొడ్డి వైపు, మరొకటి వీధి వైపు పాతేశాడు. ఇంక పాము రాదు, దాని బాబు రాదు అనుకున్నాడు ధైర్యంగా. నాలుగైదు రోజులు గడిచాయి.

మొక్క మహిమో, మరేమో కానీ పాము రావడం మాత్రం జరగలేదు. అరవిందం ఆనందానికి అవధులు లేవు. రోజూ భుజంగాన్ని ఆకాశానికెత్తేసేవాడు.

ఓరోజు సాయంత్రం బంతి ఆడుకుంటున్న అరవిందం సుపుత్రుడు బంతిని తీస్తూ పొరపాటున దొడ్డివైపున ఉన్న పాము మొక్కను పీకేశాడు. అది చూసిన అరవిందం

"ఒరే నెలతక్కువ వెధవా!అన్నీ తల్లిపోలికలే వచ్చాయి నీకు. దాన్ని పీకుతావా? అదేమిటో తెలుసా? పాము మొక్కరా....పాము మొక్క" అంటూ సముద్రం ఒడ్డున సర్వీ మొక్క తుపానుకు ఊగుతున్నట్లు కోపంతో ముందుకూ, వెనకకూ ఊగిపోతూ నాలుగైదు బాదేశాడు కొడుకుని.

ఈ అరుపులకి, కొడుకు ఏడుపునకు కంగారుగా బయటకు వచ్చింది అలివేలు.

జరిగింది తెలుసుకుని కొడుకుని ఎత్తుకుని ఊరుకోబెడుతూ వీధి వైపు వెళ్లి బొమ్మలా ఆగిపోయింది.

"ఏమండీ" అంటూ పై ప్రాణాలు పోయేట్టు పెనుకేక పెట్టింది.

"ఏమైందే?" అంటూ పరుగున వచ్చిన అరవిందం అక్కడ దృశ్యం చూసి అవాక్కయిపోయాడు.

తమ సర్పభయంకరి తలచి తెచ్చి వీధి వైపు పాతిన పాముమొక్క పక్కనే చుట్ట చుట్టుకుని తోక ఆడిస్తూ సదరు పాము ఆడుతోంది.

'అంటే ఇది పాము మొక్క కాదన్నమాట. పాడుమొక్క' అని మనసులోనే అనుకున్నాడు అరవిందం.

ఇంతలో పాముని చూసి ఏడుస్తున్న వాడు కాస్త ఏడుపు ఆపేసి "నాన్నా అటు చూడు భలే...భలే..." అంటూ కేరింతలు కొడుతూ నవ్వడం మొదలుపెట్టాడు అరవిందం సుపుత్రుడు.

ఇంతటి పాడు మొక్కను పీకాడని తాను తన కొడుకుని నాలుగు పీకినందుకు బాధపడాలో, భయం తెలీని వయసు గల తన కొడుకు పామును చూసి సంబరపడుతున్నందుకు ఆనందించాలో, లేక డబ్బులు తగలేసి పిచ్చి మొక్కలు కొనుక్కున్నందుకు ఏడవాలో అర్థంకాని వింత ఎక్స్‌ప్రెషన్ పెట్టి అలానే ఉండిపోయాడు అరవిందం.

★

## భార్యల్ని మోయాలి

పుర్రెకో బుద్ధి, జిహ్వాకో రుచి అన్నట్లుగా ఫిన్‌లాండ్‌కు చెందిన సొంకజారిలో అనే గ్రామంలో గత ఐదు సంవత్సరాల నుండీ భార్యల్ని మోసుకు వెళ్ళే పోటీలు యమజోరుగా జరుగుతున్నాయి. పోటీల్లో పాల్గొనే వారి భార్యల బరువు కనీసం 49కేజీలైనా ఉండాలని ఈ మధ్యనే ఒక కొత్త నిబంధన కూడా పెట్టడం విశేషం.

## ప్రాచీన సత్యపీఠం

లైడిటెక్టర్లు అనేవి దోషుల చేత నిజాన్ని రాబట్టేందుకు ఉపయోగించే ఆధునిక పరికరం. అయితే ప్రాచీనకాలంలో భారతదేశంలో ఎవరైనా అబద్ధమాడుతున్నారనే అనుమానం వస్తే వారికి ఎర్రగా కాల్చిన నాగలిని చూపించి నాకమనేవారట. ఆ సమయంలో ఏర్పడే భయంతో చచ్చినట్లు నిజం చెప్పేవారు.

## గులాబీ క్రీములు

దక్షిణకొరియాకు చెందిన ఆహార నిపుణులు గులాబీరేకులలో ఓ ఐస్‌క్రీమ్‌ను రూపొందించారు. ఇది తినడం వల్ల వయసు మీరకుండా ఉంటుందని వారి ప్రచారం. దాంతో కస్టమర్స్ పిల్లల దగ్గర్నుండీ వృద్ధుల దాకా ఈ గులాబీ క్రీముల్ని తెగ లాగించేస్తున్నారట.

-పి.వి.రమణకుమార్

